# ఏజెంట్ X

యెదుల్ల సురేష్ రెడ్డి

## ఎవ్‌డోకియా



**1954, ఏప్రిల్ 6...**

**న్యూ సౌత్‌వేల్స్.....**

**కాన్‌బెర్రాలోని రష్యన్ రాయబార కార్యాలయం అంతకుముందెన్నడూ లేనంత పటిష్ఠమైన సెక్యూరిటీతో నిండి ఉంది. సాయుధులైన సెక్యూరిటీ ఆఫీసర్లు ఆ రాయబార కార్యాలయంలోని ప్రతి అంగుళాన్ని అత్యంత అప్రమత్తంగా పహారా కాస్తున్నారు. ఆ కార్యాలయంలోకి ఇతరుల రాకపోకలు నిషేధించబడ్డాయి. అందులో పనిచేసే ఉద్యోగులు సైతం బయటకు వెళ్లేందుకు వీలులేకుండా చర్యలు తీసుకున్నారు. ఎంబసీలోని లోపలి గదుల్లో ఉన్న కె.జి.బి. అధికారులు ఆ ఎంబసీలోని ప్రతి రహస్య డాక్యుమెంటుని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.**

అంతకు ముందురోజే ఆ ఎంబసీలో పనిచేస్తున్న కె.జి.బి. ఏజెంటు వ్లాదిమిర్ పెట్రోవ్ ఎంబసీ నుండి పారిపోయి ఆస్ట్రేలియా ప్రభుత్వపు శరణు జొచ్చాడు. ఇది కె.జి.బి.కి చాలా పెద్ద దెబ్బ. సీనియర్ కె.జి.బి. ఏజెంటు, ఆ ఎంబసీలోని రహస్యాలన్నీ తెలిసిన పెట్రోవ్ ఊహించని విధంగా పారిపోయి ఆస్ట్రేలియా పంచన చేరడం వారిని విస్మయపరచింది. వెళుతూ వెళుతూ పెట్రోవ్ ఆ ఎంబసీలోని సీక్రెట్ డాక్యుమెంట్లు నన్నింటినీ తీసుకెళ్లడంతో వారు మరింత కలవరపడ్డారు. అవన్నీ ఆస్ట్రేలియా చేతిలో పడితే ఎన్ని గొడవలు చెలరేగుతాయో వారికి మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. పెట్రోవ్ పారిపోయాడని తెలిసిన మరుక్షణం ఎంబసీని కట్టుదిట్టం చేసి, అతను తీసుకెళ్లిన సీక్రెట్ డాక్యుమెంట్ల గురించి ఆరా తీయడం ప్రారంభించారు వాళ్లు.

అదే ఎంబసీలోని మరో గదిలో ఒంటరిగా కూర్చుని ఉంది పెట్రోవ్ భార్య, మరో కె.జి.బి. ఏజెంటు అయిన ఎవ్‌డోకియా. తన భర్త ఎంబసీ నుండి పారిపోయి ఆస్ట్రేలియా ప్రభుత్వపు ఆశ్రయం పొందాడని ఆమెకు అంతక్రితమే తెలిసింది. ఇది ఆమెకు కూడా ఊహించని పరిణామమే. తన భర్త తనతో చెప్పకుండా అలా పారిపోతాడని ఆమె ఏ మాత్రం ఊహించలేదు.

ఆమెకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఎంబసీ నుండి బయటపడే మార్గం కూడా కనిపించలేదు. కె.జి.బి. అధికారులు తనను వదలరని ఆమెకు తెలుసు. పెట్రోవ్ పారిపోయాడని తెలిసిన మరుక్షణమే వాళ్లు ఆమెను ఎక్కడికీ కదిలే అవకాశం లేకుండా నిర్బంధించారు. అక్కడి నుండి తనను

రష్యాకు తీసుకువెళ్లి ఇంటరాగేషన్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె ఊహించగలదు. జరిగిన దానిలో తనకు కూడా భాగం ఉందని వాళ్లు అనుమానిస్తారు. దాని గురించి చెప్పమని తప్పకుండా వేధిస్తారు. ఇంతా చేస్తే తనకు దీని గురించి ఏమీ తెలియదు. ఆ పరిస్థితుల్లోంచి ఎలా బయటపడాలో ఆమెకు ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. తనను రష్యాకు తీసుకువెళ్లే లోపే ఎలాగైనా ఇక్కడ నుండి తప్పించుకోవాలి. లేకపోతే తను కె.జి.బి. అధికారుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది.

ఆమె ఆలోచనలు పూర్తికాక ముందే నలుగురు కె.జి.బి. అధికారులు ఆ గదిలోకి ప్రవేశించారు. ఆమెకు మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వలేదు వాళ్లు. తప్పించుకోవడానికి ఏ మాత్రం అవకాశం లేనివిధంగా చాలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్యన ఆమెను అక్కడి నుండి బయటకు తీసుకుపోయారు.

★ ★ ★

సీనియర్ కె.జి.బి. ఏజెంటయిన వ్లాదిమిర్ పెట్రోవ్ కోడ్ లాంగ్వేజీని తయారు చేయడంలోనూ, శత్రువుల కోడ్ లాంగ్వేజీని డీకోడ్ చేయడంలోనూ బహు నేర్పరి. కాన్‌బెర్రా ఎంబసీకి రాకముందే అతను రష్యా నౌకాదళంలో కోడ్ లాంగ్వేజీ నిపుణుడిగా పని చేసేవాడు. ఆ తరువాత రష్యా ప్రభుత్వం అతన్ని కాన్‌బెర్రాలోని రష్యా ఎంబసీలో అక్కడి రష్యా జాతీయుల బాగోగుల్ని పర్యవేక్షించే అధికారిగా నియమించింది. మరో సీనియర్ కె.జి.బి. ఏజెంటయిన అతని భార్య ఎవ్‌డోకియా కూడా అతనితోపాటే కాన్‌బెర్రాకు చేరుకుంది. పైకి మామూలు ఎంబసీ అధికారులుగా నటిస్తూ, వీరిద్దరూ అక్కడ తమ గూఢచార కార్యకలాపాల్ని ప్రారంభించారు. అయితే త్వరలోనే ఆస్ట్రేలియా గూఢచార సంస్థ ఏ.ఐ.ఎస్.ఓ వీరిద్దరి రహస్యాన్ని కనుక్కుంది. ఆ తరువాత వాళ్లు పెట్రోవ్‌ను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఏ.ఐ.ఎస్.ఓ ఆదేశాల మేరకు పోలిష్ శరణార్థి అయినా మైఖేల్ బయలోగుస్కీ అనే డాక్టరు పెట్రోవ్‌తో పరిచయాన్ని పెంచుకున్నాడు. తను కమ్యూనిస్టు సానుభూతి పరుడిగా నటిస్తూ త్వరలోనే పెట్రోవ్‌కు సన్నిహితుడిగా మారిపోయాడు.

అతన్ని పూర్తిగా నమ్మిన పెట్రోవ్ తన వ్యక్తిగత విషయాలను సైతం అతనితో చర్చించేవాడు. పెట్రోవ్ ఎంబసీ నుండి పారిపోయి ఆస్ట్రేలియా ఆశ్రయాన్ని పొందడం మంచిదన్న అభిప్రాయాన్ని అతనిలో కలిగించడంలో డాక్టర్ బయలోగుస్కీ సఫలీకృతు డయ్యాడు. అతని సలహామేరకు ఆస్ట్రేలియా ఆశ్రయాన్ని కోరడానికి సిద్ధమయిన పెట్రోవ్ అందుకు తగిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకున్నాడు. ఆస్ట్రేలియాలో నివసించడానికి వీలుగా అక్కడ ఒక ఫాం హౌస్‌ని కూడా కొనుక్కున్నా డతను. ఈలోగా రష్యా ప్రభుత్వం పెట్రోవ్‌ని వెనక్కి వచ్చేయాల్సిందిగా ఆదేశాల్ని జారీ చేసింది. అతని వద్ద నుండి ఉద్యోగ బాధ్యతల్ని స్వీకరించడానికి మరో అధికారి రష్యా నుండి అక్కడికి వస్తున్నాడనగా ఎంబసీలోని సీక్రెట్ డాక్యుమెంట్ల నన్నింటినీ తీసుకున్న పెట్రోవ్ అక్కడి నుండి పారిపోయి ఆస్ట్రేలియా ప్రభుత్వపు ఆశ్రయాన్ని సంపాదించుకున్నాడు.

ఈ విషయాలన్నీ ఎవ్‌డోకియాకు తెలిసేసరికీ ఆలస్యం జరిగిపోయింది. పెట్రోవ్ ఎంబసీ నుండి పారిపోయాడని తెలిసిన మరుక్షణం కె.జి.బి. అధికారులు ఆమెను ఎంబసీలోనే నిర్బంధించారు.

★ ★ ★

**సిడ్నీ ఏర్ పోర్ట్....**

సాయుధులైన రష్యా గార్డులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఎవడోకియాతో సహా ఆ విమానాశ్రయంలోకి ప్రవేశించారు. అక్కడి నుండి ఆమెను రష్యాకు తీసుకువెళ్లడానికి అంతకు ముందే ఏర్పాట్లు జరిగాయి. వారు ప్రయాణించాల్సిన విమానం సిద్ధంగా ఉంది.

అయితే ఆమెను బలవంతంగా రష్యాకు తీసుకువెళుతున్నారని తెలియడంతో కోపోద్రిక్తులైన ఆస్ట్రేలియా ప్రజలు పెద్ద ఎత్తున ఆ విమానాశ్రయాన్ని చుట్టుముట్టారు. వారి మధ్యనుండి అతి జాగ్రత్తగా ఎవ్‌డోకియాను విమానం వద్దకు చేర్చగలిగారు గార్డులు. సాయుధులైన ఇద్దరు కె.జి.బి. గార్డులు ఆమెతో సహా విమానంలోకి ప్రవేశించారు.

ఇక తను రష్యాకు చేరకుండా తప్పించుకోవడానికి గల అన్ని మార్గాలూ మూసుకుపోయాయని భావించిన ఎవ్‌డోకియా విషణ్ణ వదనంతో కూర్చుండిపోయింది. అయితే చివరిక్షణంలో ఆమె ఊహించని రీతిలో సహాయం వచ్చిపడింది. ఆ విమానంలోని ఎయిర్ హోస్టెస్ ఎవ్‌డోకియాకు రక్షణగా ఉన్న గార్డుల కంటపడకుండా ఆమెకు కొన్ని కాగితాల్ని అందించింది. ఎవ్‌డోకియాను తనతోపాటు ఆస్ట్రేలియాలోనే ఉండిపోవడానికి అంగీకరించాల్సిందిగా అభ్యర్థిస్తూ పెట్రోవ్ రాసిన ఉత్తరం అది. దాన్ని చదివిన వెంటనే ఎవ్‌డోకియా అందుకు తన అంగీకారాన్ని తెలియజేసింది. ఆమె నుండి ఆ సమాధానాన్ని విన్న ఎయిర్ హోస్టెస్ ఆ విషయాన్ని ఆ విమానపు పైలెట్‌కు తెలిపింది. అతను వెంటనే డార్విన్ ఏర్ పోర్టులో వేచి ఉన్న ఆస్ట్రేలియా అధికారులకు ఆ సందేశాన్ని పంపించాడు. ఆ విమానం డార్విన్ ఏర్ పోర్ట్‌లో ఆగిన మరుక్షణం ఆస్ట్రేలియా పోలీసులు అందులోకి దూసుకువెళ్లి ఎవ్‌డోకియాకు రక్షణగా ఉన్న రష్యా గార్డుల్ని లొంగదీసుకుని ఆమెను క్షేమంగా ఆమె భర్త పెట్రోవ్, వద్దకు చేర్చారు.

ఆస్ట్రేలియా ప్రభుత్వాధికారులముందు పెట్రోవ్, ఎవ్‌డోకియాలు తమకు తెలిసిన రహస్యాల నన్నింటినీ బయటపెట్టారు. తూర్పు యూరప్ నుండి వచ్చే శరణార్థులతోపాటు కలిసి ఆస్ట్రేలియాలోకి ప్రవేశిస్తున్న రష్యా గూఢచారుల గురించి, ఆస్ట్రేలియాలోని యురేనియం గనుల తాలూకు సమాచారాన్ని సేకరిస్తున్న రష్యా అక్కడి అధికారుల్ని లొంగదీసుకుని వారికి అనుకూలంగా మార్చుకోవడం గురించీ, ఇంకా మరెన్నో ఇతర కె.జి.బి. కార్యకలాపాల గురించి ఆస్ట్రేలియా ప్రభుత్వానికి సమాచారాన్ని అందించారు. బ్రిటన్ ఇంటెలిజెన్స్‌లో డబుల్ ఏజెంట్ల గురించి కూడా వాళ్లు బయటపెట్టారు. వాళ్లు అందించిన సమాచారంతో ఆస్ట్రేలియాలోని కె.జి.బి. కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగింది.

పెట్రోవ్, ఎవ్‌డోకియాలు మాత్రం ఆస్ట్రేలియా సంరక్షణలో కె.జి.బి. నుండి ఎలాంటి ప్రమాదమూ లేకుండా తప్పించుకోగలిగారు. ●

